సాక్షి
అనంతపురం
మంగళవారం ׀ 12 ׀ మార్చి ׀ 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.31	సెహరీ : 5.14



న్యూస్‌రీల్

చంద్రబాబు ద్రోహం చేశారు!

- సన్నిహితులతో టీడీపీ నేత ఉమా మహేశ్వరనాయుడు ఆవేదన



తన సన్నిహితులతో సమావేశమైన ఉమా మహేశ్వర నాయుడు

కళ్యాణదుర్గం: కష్టకాలంలో పార్టీని నడిపించి, కార్యకర్తలను కాపాడుకున్న తనకు చంద్రబాబు ద్రోహం చేస్తారని కలలో కూడా ఊహించలేదని టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు తన అనుచరులతో వాపోయినట్లు సమాచారం. స్థానిక ఆయన స్వగృహంలో సోమవారం సన్నిహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుతో తాడో పేడో తేల్చుకుందామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులకు కాకుండా డబ్బుకు అమ్ముడుపోయి బడా కాంట్రాక్టర్‌కు టికెట్ ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది.అమిలినేనికి సహకరించేది లేదంటూ స్పష్టం చేసినట్లు సమాచారం . త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని, తనకు అండగా నిలవాలని సన్నిహితులను ఉమా కోరారు.


నిధుల అక్రమ మళ్లింపు.. అసిస్టెంట్ మేనేజర్ అరెస్ట్



గార్లదిన్నె: ఖాతాదారుల డబ్బును అక్రమంగా మళ్లించిన కేసులో అసిస్టెంట్ మేనేజర్‌ను మండల పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన మేరకు.. గార్లదిన్నె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో 2018 సంవత్సరంలో అసిస్టెంట్ మేనేజర్‌గా హర్షవర్ధన్ విధులు నిర్వర్తించారు. దాదాపు 30 మంది ఖాతాదారుల డబ్బు రూ.7,19,376ను అక్రమంగా తన సొంత ఖాతాలోకి బదిలీ చేసుకున్నారు. కొన్నాళ్లకే ఈ విషయాన్ని బ్యాంకు సిబ్బంది గుర్తించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన ఆయన..ఆరోపణలు వాస్తవమని తేలడంతో హర్షవర్ధన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. డబ్బును రికవరీ చేశారు. అనంతరం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న హర్షవర్ధన్ కోసం గాలింపు చేపట్టారు. సోమవారం కల్లూరులో ఉన్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి హర్షవర్ధన్‌ను అరెస్ట్ చేశారు. అనంతపురం మొబైల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపారు.

ఐదుగురు పోలీసుల డిస్మిస్

- ఒక జూనియర్ అసిస్టెంట్ కూడా..



అనంతపురం: ఇంటి దొంగలపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కన్నెర్ర జేశారు. మట్కా, గంజాయి విక్రేతలతో నెల వారీ మామూళ్లు వసూలు చేసినట్లు నిర్ధారణ కావడంతో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు, చిట్టీల పేరున ప్రజల నుంచి లక్షలాది రూపాయలు సేకరించి ఎగ్గొట్టిన జూనియర్ అసిస్టెంట్‌ను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో తాడిపత్రి పట్టణంలో పనిచేస్తున్న సమయంలో ఓ హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు.. మట్కా నిర్వాహకులు,బీటర్లు, గంజాయి విక్రేతలతో నెల వారీ మామూళ్లు వసూలు చేశారు. దీంతో ఐదుగురిని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకున్నారు. ఆరోపణలపై డిపార్ట్‌మెంటల్ విచారణ మాత్రం కొనసాగించారు. ఈ క్రమంలోనే విచారణ నివేదిక ఇటీవల ఎస్పీకి అందింది. ఆరోపణలు రుజువని తేలింది. దీంతో ఐదుగురినీ ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు.

- ఇక.. జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్ అనధికారికంగా ప్రైవేట్ చీటీలు నిర్వహించి ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఎగ్గొట్టారు. విచారణలో ఇవన్నీ వాస్తవాలు అని తేలడంతో ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు.

పదిలంగా పాతాళ గంగ



- సేఫ్‌జోన్‌లో జిల్లా
- తాజా జిల్లా సగటు నీటి మట్టం 12.26 మీటర్లుగా నమోదు
- గత ఏడాది వర్షాభావంతో స్వల్పంగా తగ్గిన భూగర్భజలం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా తాజాగా సేకరించిన వివరాల ప్రకారం సగటు నీటి మట్టం 12.26 మీటర్లుగా నమోదైంది. దీంతో 31 మండలాలు సురక్షిత జాబితా (సేఫ్ జోన్)లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. సగటు నీటి మట్టం 15 మీటర్లు దాటితే కొంత ఇబ్బందిగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. గత నాలుగేళ్లు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. సాధారణం కన్నా 30 నుంచి 40 శాతం అధిక వర్షపాతం నమోదైంది. గత ఏడాది మాత్రం వరుణుడు కాస్త విరామం తీసుకున్నాడు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురిశాయి. దీంతో గత నాలుగేళ్లతో పోల్చితే ప్రస్తుతం భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. అయినా ప్రమాదకర స్థాయిని దాటిపోలేదని భూగర్భజలశాఖ అధికారులు చెబుతున్నారు.

బాబు హయాంలో ఘోరం..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–18 మధ్యకాలంలో భూగర్భజలాలు గణనీయంగా క్షీణించాయి. ఆ ఐదేళ్లు 18 నుంచి 26 మీటర్ల మధ్య కొనసాగాయి. వర్షాలు కురవకపోవడంతో ఒక్క ఏడాది కూడా కనీసం 15 మీటర్ల మార్క్ చేరుకోలేదు. అప్పటితో పోల్చితే గత ఐదేళ్లుగా భూగర్భజలాలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. ఒక దశలో అంటే 2022, 2023 మార్చి వరకూ చూసుకుంటే 30 సంవత్సరాల జిల్లా చరిత్రను తిరగరాస్తూ సగటు నీటి మట్టం కేవలం 6 మీటర్లే నమోదైంది. గత ఏడాది వర్షాలు లేక పరిస్థితిలో కొద్దిగా మార్పు వచ్చింది. మే, జూన్ నెలల్లో మంచి వర్షాలు పడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దీంతో తిరిగి భూగర్భజలాలు సాధారణ స్థాయికి చేరుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలతో మేలు..

గత ఏడాది 461.6 మి.మీకు గానూ 36 శాతం లోటుతో 293.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు భూగర్భజలశాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. 104 టీఎంసీల వర్షప్రవాహం కొనసాగితే అందులో, 13 టీఎంసీల వరకు భూగర్భంలోకి ఇంకినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భూగర్భంలో 42 టీఎంసీలు ఉండగా అందులో 14 టీఎంసీల వరకూ వాడుతున్నారన్నారు. ఈ లెక్కన 28 టీఎంసీల వరకు అందుబాటులో ఉన్నందున ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రెండు నెలలూ ప్రజలు నీటి ఆదా చర్యలు చేపడితే వేసవిలో సమస్య ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం 31 మండలాలు సేఫ్‌జోన్‌లో ఉన్నట్లు తెలిపారు.

మండలాల వారీగా సగటు నీటి మట్టం ఇలా..

మండలం	నీటిమట్టం (మీటర్లలో)
అనంతపురం	7.18
బీకే సముద్రం	6.90
బొమ్మనహాళ్	6.96
డి.హీరేహాళ్	19.67
గుత్తి	13.13
గుంతకల్లు	7.81
కంబదూరు	13.74
కూడేరు	10.96
నార్పల	7.69
పెద్దపప్పూరు	1.90
పుట్లూరు	16.52
రాయదుర్గం	17.42
శింగనమల	8.85
ఉరవకొండ	5.41
విడపనకల్లు	6.09
యల్లనూరు	8.12
ఆత్మకూరు	7.01
బెళుగుప్ప	14.92
బ్రహ్మసముద్రం	13.71
గార్లదిన్నె	3.73
గుమ్మఘట్ట	13.23
కళ్యాణదుర్గం	17.45
కణేకల్లు	18.45
కుందుర్పి	13.84
పామిడి	14.54
పెద్దవడుగూరు	6.40
రాప్తాడు	5.36
శెట్టూరు	28.07
తాడిపత్రి	13.43
వజ్రకరూరు	11.08
యాడికి	23.36

అర్జీలను పెండింగ్ పెట్టొద్దు

- అధికారులకు డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలను పెండింగ్ పెట్టకూడదని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి డీఆర్‌ఓతో పాటు ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు శంకరయ్య, ఆనంద్, డీపీఓ ఉమా మహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 255 వినతులు అందాయి. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రతి అర్జీని గడువు కంటే ముందే పరిష్కరించాలన్నారు.

వినతులు కొన్ని..

- తమకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో కమ్యూనిస్టు పార్టీ వారు గుడిసెలు వేశారని ఎస్సీ సంఘాల నాయకులు కేపీ నారాయణస్వామి, చిన్నపెద్దన్న, బాలరాజు తదితరులు ఫిర్యాదు చేశారు. ఉప్పరపల్లి పొలం సర్వే నంబరు 194–8లోని తొమ్మిది ఎకరాల స్థలంలో రెండు సెంట్ల చొప్పున 270 మందికి ఇచ్చారన్నారు. గతంలో భూమిని కొందరు ఆక్రమించగా ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై అప్పటి ఆర్‌డీఓ మధుసూదన్ విచారణ చేసి భూమి తమకు చెందుతుందని తెలియజేస్తూ గత ఏడాది అక్టోబరు 25న ఉత్తర్వులను ఇచ్చారన్నారు. ఇప్పుడదే స్థలంలో సీపీఎం వారు గుడిసెలు వేశారని, చర్యలు తీసుకోవాలని కోరారు.
- తన భూమికి నిరభ్యంతర పత్రం ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని గార్లదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 408–1లో తనకు చెందిన 1.14 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. విచారణ చేసి ఎన్‌ఓసీ మంజూరు చేయాలని కోరారు.

రంజాన్ మాసం ప్రారంభం

- మసీదుల్లో ముస్లింల ప్రార్థనలు
- వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని మతపెద్దల సూచన



విద్యుద్దీపాలంకరణలో అనంతపురంలోని ఈద్గా మసీదు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్/రాయదుర్గంటౌన్: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మసీదులు కొత్త శోభ సంతరించుకున్నాయి. సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో ఇషా నమాజ్ అనంతరం ముస్లింలు ఖురాన్ పఠనం (ప్రత్యేక తరావీ నమాజ్) ప్రారంభించారు. నెలరోజుల పాటు ప్రత్యేక తరావీ చేయనున్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు 30 రోజుల పాటు కఠోర దీక్షలు చేపడతారు. అత్యంత నియమనిష్టలు పాటిస్తూ దైవ చింతనలో తరిస్తారు. రోజూ ఉషోదయానికి ముందే ఉపవాసాలు ప్రారంభిస్తారు. దీన్ని సహరీ అంటారు. సూర్యాస్తమయం కాగానే అల్పాహారంతో దీక్ష విరమిస్తారు. రోజులో 5 సార్లు నమాజు (ఉదయం ఫజర్, మధ్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, 6.30 గంటలకు మగ్‌రిబ్, రాత్రి 8.30 గంటలకు ఇషా) చేస్తారు. ఇందులో తరావీహ నమాజ్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ఇషా నమాజ్ తర్వాత ఎంతో నిష్టతో మరోసారి తరావీహ నమాజ్ చేస్తారు. రోజా పాటించే వారు మనసును భగవంతునిపై లగ్నం చేసి చెడు ఆలోచనలకు దూరంగా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయం మసీదుల్లో దైవ ధ్యానంలో గడుపుతారు. రోజుకు కనీసం 14 గంటల పాటు ఉపవాస దీక్ష ఉంటుంది. రంజాన్‌లో చేపట్టే ఏహ్‌తేకాఫ్, జకాత్, ఫిత్రా, ఇఫ్తార్, తరావీహ నమాజ్‌తో ఏడాది అంతా శుభం కలుగుతుందని ముస్లింల విశ్వాసం. ఇక.. ఈనెలలో జకాత్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. జకాత్ అంటే దానం చేయడం. అనాథలు, వృద్ధులకు ప్రతి ముస్లిం తనకున్న నికర ఆదాయంలో నూటికి రెండున్నర వంతున ఇవ్వాలని ఖురాన్ చెబుతోంది. పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన సతామిని ఉపవాసాలు ప్రారంభమైన 27వ రోజున జరుపుకుంటారు.

ఇఫ్తార్ ప్రత్యేకత..: రంజాన్‌లో ముస్లింలు ఉపవాస దీక్షను విరమింపచేసే కార్యక్రమాన్ని ఇఫ్తార్ అంటారు. ఈ సమయంలో తీసుకునే ఆహారాన్ని దీక్షాపరులకు అందించడం కూడా పుణ్యకార్యంగా భావిస్తారు. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్షపరులకు విరివిగా ఇఫ్తార్ విందు ఇస్తారు.

ఉపవాస దీక్షలతో మేలు



ఉపవాస దీక్షలు ఆరోగ్యానికి మంచి చేస్తాయి. క్యాన్సర్‌ను కూడా అదుపు చేయవచ్చు. వేసవి నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ దుస్తులు, టోపీ ధరిస్తే వేడి తగ్గుతుంది. సహరిలో మసాలాలు కాకుండా పండ్ల రసాలు తీసుకుంటే చాలా మంచిది. మధుమేహం ఉన్న వారు కూడా ఉపవాసాలు ఉండవచ్చు. చక్కెర తక్కువ ఉన్న పళ్లు, మజ్జిగ తీసుకోవాలి.

– డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, ముతవల్లి

అనంత మీదుగా మరో 'వందేభారత్'

- నేటి నుంచి గుల్బర్గా–బెంగళూరు రైలు రాకపోకలు



వందేభారత్ రైలు

అనంతపురం సిటీ: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన వందేభారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలకు ఈ రైళ్లను దశల వారీగా ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కాచిగూడ–బెంగళూరు మధ్య వందే భారత్ రైలు నడుస్తుండగా, తాజాగా కర్ణాటకలోని గుల్బర్గా (కలబురగి) నుంచి బెంగళూరు వరకు మరో రైలును మంగళవారం లాంఛనంగా ప్రారంభించనుంది.అనంతపురం రైల్వే స్టేషన్‌లో రైలుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు.

అనంతపురం మీదుగా రెండో రైలు

కాచిగూడ–బెంగళూరు వయా అనంతపురం మీదుగా ఇప్పటికే ఒక వందేభారత్ రైలు విజయవంతంగా నడుస్తోంది. ఇప్పుడు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా నుంచి మరో రైలు ప్రారంభం కానుంది. ఇది రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, అనంతపురం మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈ రైలు (22231/32) కలబురగిలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయలుదేరుతుంది. 5.40 గంటలకు వాడి, 6.53కు రాయచూరు, 5.08 గంటలకు మంత్రాలయం, 8.25కు గుంతకల్లు, అనంతపురానికి 9.28కి చేరుకుని 9.30 గంటలకు బయలుదేరుతుంది.12.45కు యలహంకకు, బెంగళూరులోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం ఇలా..

బెంగళూరులో 22232 సర్వీసుగా మధ్యాహ్నం 2.45కు బయలుదేరి 3.08కి యలహంక, 5.58కి అనంతపురం, రాత్రి 7కు గుంతకల్లు, 8.15 మంత్రాలయం, 8.45 రాయచూరు, 11.05 వాడి, కలబురగి(గుల్బర్గా) రాత్రి 11.30 గంటలకు చేరుకుంటుందని అనంతపురం రైల్వే స్టేషన్ అధికారులు తెలిపారు. వారంలో ఆరు రోజులు నడుస్తుందని వెల్లడించారు.

మోజు తీర్చుకుని మొహం చాటేశాడు

- యువతిని వంచించిన టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున



బాధిత యువతితో మల్లికార్జున (ఫైల్)

తాడిపత్రి/రూరల్: యువతిని ప్రేమ పేరుతో లోబరుచుకుని మోజు తీర్చుకున్నాక మొహం చాటేశాడో టీడీపీ కౌన్సిలర్. పెళ్లి చేసుకోమని నిలదీస్తే బాధితురాలిపైనే దాడి చేశాడు. దీంతో ఆమె సోమవారం అనంతపురం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'లో ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి గోడు వెళ్లబోసుకుంది. ఎస్పీ సూచన మేరకు తాడిపత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. తాడిపత్రి 30వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరుడు. పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానంటూ కొన్ని నెలల క్రితం వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. యువతిని ఆమె ఇంటి నుంచి తీసుకొచ్చి తనకు తెలిసిన వారి ఇంట్లో ఉంచాడు. అనంతరం ఆమెతో సహజీవనం చేశాడు. యువతి రెండు సార్లు గర్భం దాల్చగా, ఇప్పుడే పిల్లలు ఎందుకు అంటూ అబార్షన్‌లు కూడా చేయించాడు. ఇటీవల యువతికి అనుమానమొచ్చి మల్లికార్జున సెల్‌ఫోన్ పరిశీలించగా, వాట్సాప్‌లో మరో మహిళతో చాటింగ్ చేసిన విషయం బయటపడింది. దీనిపై మల్లికార్జున ప్రశ్నిస్తే కొట్టి బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే మల్లికార్జునతో సంబంధం పెట్టుకున్న మహిళ కూడా రంగంలోకి దిగింది. తను మల్లికార్జునతో తీయించుకున్న ఫొటోలను బాధిత యువతి సెల్‌ఫోన్‌కు పంపింది. వారం క్రితం మళ్లీ యువతి ఇంటికి వచ్చిన మల్లికార్జున మాయమాటలు చెప్పి రెండు రోజులు గడిపాడు. వివాహం చేసుకోమని ప్రశ్నిస్తే తీవ్రంగా కొట్టాడు. విషయం బయటకు చెబితే భూమిపైనే లేకుండా చేస్తానంటూ బెదిరించాడు. తాను వేరే అమ్మాయిని ప్రేమిస్తున్నానని, తనతోనే జీవితం అంటూ చెప్పాడు. దీంతో ఆమె మల్లికార్జున ఇంటికి వెళ్లింది. తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన కుటుంబసభ్యులకు వివరించింది. సర్దిచెప్పాల్సిన వారు కూడా దౌర్జన్యం చేశారు. యువతిని కొట్టి పంపించారు. దీంతో యువతి కుమిలికుమిలి ఏడ్చింది. తెలిసిన వారి సూచన మేరకు సోమవారం అనంతపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని గోడు వెళ్లబోసుకుంది. ఆయన సూచన మేరకు తాడిపత్రి పోలీసులను కలిసి ఫిర్యాదు చేసింది. ప్రేమ పేరుతో తనలాంటి వారి జీవితాలతో ఆటలాడుతున్న మల్లికార్జునపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రజలకు మంచి చేస్తే చంపుతామంటున్నారు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

ఆత్మకూరు: 'ఎవరైనా తమ ప్రభుత్వం వస్తే ప్రజలకు మంచి చేస్తాం, అభివృద్ధి చేస్తాం అని చెబుతారు. కానీ టీడీపీ నాయకులు మాత్రం తాము అధికారంలోకి వస్తే వెంటాడి చంపుతామని అంటున్నారు. ఎమ్మెల్యే అయిన నన్నే నరుకుతాం అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేస్తే చంపుతామంటారా? అని ప్రశ్నించారు. సోమవారం ఆత్మకూరులో 'వైఎస్సార్ చేయూత' మెగా చెక్కు, మహిళలకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఫ్యాక్షన్‌కు మళ్లీ ఆజ్యం పోస్తున్నారన్నారు. ఓ టీడీపీ నాయకుడు ఏకంగా తననే అసభ్య పదజాలంతో బెదిరిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడన్నారు. చంద్రబాబు గెలిచాక తనను, బండి రవిని వెంటాడి మరీ చంపుతామన్నారంటే వారు ఎంతటి దుర్మార్గులో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇటీవల గీతాంజలి అనే మహిళ తనకు ప్రభుత్వం స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేసిందని ఆనందం వ్యక్తం చేస్తే, జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన నాయకులు ఆమెపై సోషల్ మీడియాలో ట్రోల్స్ చేయడంతో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి మనం ఓటు వేద్దామా అంటూ ప్రజలను ప్రశ్నించారు.

పరిటాల సునీత చేయని అభివృద్ధి చేసి చూపా

గతంలో ఎన్నడూ లేని విధంగా రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి తెలిపారు. సొంత డబ్బుతో అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి మహిళలకు అంకితం చేశానన్నారు. పేదలకు 17 వేల ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు రైతులకు ఉచితంగా బోర్లు వేయించానన్నారు. 10 సంవత్సరాలు మంత్రిగా ఉన్న పరిటాల సునీత చేయలేని సంక్షేమాభివృద్ధి చేసి చూపించామన్నారు. ఎమ్మెల్యే అయిన ఏడాదికే పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చామన్నారు. రూ.154 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశామన్నారు. రామగిరి మండలానికి రూ.1,500 కోట్లతో 300 మెగావాట్ల సోలార్ హైబ్రిడ్ పవర్ ప్లాంట్ తీసుకొచ్చామన్నారు. అనంతరం మహిళలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,06,030 మంది పిల్లలకు బాలల బీమా కింద ఎమ్మెల్యే రూ.1.15 లక్షలు చెల్లించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

455 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్–2బీ, జువాలజీ–2, హిస్టరీ–2 పరీక్షలు జరిగాయి. మొత్తం 455 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 14,298 మందికి గాను 13,895 మంది హాజరయ్యారు. 402 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,245 మందికి గాను 1,192 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. అనంతపురం కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంలో ఒక విద్యార్థి కాపీ కొడుతూ బుక్ కావడంతో డిబార్ అయ్యాడు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం. వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 కేంద్రాలు పరిశీలించాయి. 4 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు.

కేజీబీవీ దరఖాస్తులకు వేళాయె

- నేటి నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చు
- 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలు
- 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు



రాప్తాడు: నిరుపేద, అనాథ బాలికల చదువుకు కేజీబీవీలు (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు) ఆలవాలంగా మారాయి. ఉచిత వసతి, భోజన సదుపాయంతో ప్రమాణాలతో కూడిన విద్యను బోధిస్తున్నాయి. బాలికల భవితకు గట్టి పునాది వేస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్‌కు బాసటగా నిలుస్తున్నాయి. కేజీబీవీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉంది. అర్హులైన బాలికలు ప్రవేశాలు పొందవచ్చు.

62 కేజీబీవీల్లో 2,480 సీట్లు

ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 63 మండలాలకు గాను 62 కేజీబీవీలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలకు 32 కేజీబీవీలు, శ్రీ సత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు 30 కేజీబీవీలు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన సాగే ఈ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 40 సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,480 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే 11వ తరగతి (ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం)లో వివిధ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మరో వైపు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది.

అర్హతలు ఇలా .....

అనాథ, వీధి బాలికలు, పేద, పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలకు తొలి ప్రాధాన్యత కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, అసిస్టెంట్ లేబర్ సహాయ శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుంది. 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన బాలికలై ఉండాలి. ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు. విద్యార్థినులు తమ దరఖాస్తును 'ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఎంపికైన బాలికలకు ఫోన్ మెసెజ్ ద్వారా సమాచారం అందుతుంది. ఆయా పాఠశాల నోటిఫికేషన్ బోర్డు లోనూ నేరుగా చూడవచ్చు.

అన్నీ ఉచితమే

కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉంది. విద్యాలయాల్లో చేరిన బాలికలకు ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పిస్తారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, కాస్మోటిక్ చార్జీలు అందజేస్తారు. రోజూ పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం పెడతారు. ప్రత్యేక అధికారి నుంచి టీచర్లు, వాచ్‌మన్, స్వీపర్ వరకు అందరూ మహిళలే ఉంటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన సాగుతుంది.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించడమే 'స్పందన' ముఖ్య ఉద్దేశమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'స్పందన' నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించారు. అనంతరం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడి 'స్పందన' అర్జీలకు పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీసు 'స్పందన' విభాగం 93929 26803 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆంథోనప్ప, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల ర్యాంప్ సర్వే వేగవంతం

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)పై చేపట్టిన ర్యాంప్ సర్వేను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు కార్యదర్శులకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే వాణిజ్య రంగాల్లోని అన్ని పరిశ్రమలను డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. పోర్టల్‌కు అనుసంధానమైతే పరిశ్రమలలో ఉత్పత్తి అయ్యే వస్తువులను ఎగుమతులు చేసుకునేందుకు అవకాశం మెండుగా ఉంటుందన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు బ్యాంక్ రుణ సదుపాయాలు సులభతరం అవుతాయన్నారు. ర్యాంప్ సర్వేకు పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

'అనంత' హాకీ జట్టుకు మూడో స్థానం



అనంతపురం జిల్లా హాకీ జట్టు సభ్యులు

అనంతపురం: ప్రకాశం జిల్లా మైనంపాడులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ 14వ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అనంతపురం హాకీ జట్టుకు మూడో స్థానం దక్కింది. అనంతపురం జట్టుకు జట్టుకు కోచ్‌గా ఎస్.అనిల్ కుమార్, మేనేజర్‌గా వెంకటేశ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా హాకీ జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు.

ప్రసన్నాయపల్లి గూడ్స్ షెడ్ నేడు ప్రారంభం

అనంతపురం సిటీ: అనంతపురం శివార్లలోని ప్రసన్నాయపల్లి రైల్వే గూడ్స్ షెడ్‌ను మంగళవారం ప్రారంభించనున్నారు. దేశ వ్యాప్తంగా చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే ప్రక్రియకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రసన్నాయపల్లి గూడ్స్ షెడ్‌ను వర్చువల్ విధానంలో ప్రధాని ప్రారంభించనున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు.

శభాష్...రేణుక!

- పెయింట్‌తో ప్రమాద సూచిక ఏర్పాటు



స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో అని అక్షరాలను రాస్తున్న వలంటీర్ రేణుక

పుట్లూరు: రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను గమనించక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం యల్లనూరుకు వెళ్తున్న ఓ మహిళ బైక్‌పై నుంచి జారి పడి మృతి చెందింది. తాడిపత్రి–యల్లనూరు ప్రధాన రోడ్డుపై శనగలగూడూరు వద్ద స్పీడ్ బ్రేకర్ వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆ గ్రామ వలంటీర్ రేణుక గమనించింది. ప్రమాదాలను నివారించడానికి తనవంతు ప్రయత్నం చేసింది. తెల్ల పెయింట్‌తో స్లో అని ఆంగ్లంలో అక్షరాలు రాయడంతో పాటు స్పీడ్ బ్రేకర్ కనిపించేలా సూచిక ఏర్పాటు చేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శభాష్ రేణుక అని అభినందిస్తున్నారు.

అత్యంత వైభవం.. మద్దానేశ్వర రథోత్సవం





ప్రత్యేక అలంకరణలో మద్దానేశ్వరుడు, అశేష జనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

రాయదుర్గంరూరల్: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో మద్దానేశ్వరస్వామి రథోత్సవం సోమవారం అశేష భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, సర్పంచ్ దురుగుమ్మతో కలిసి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు యువకులు నందికోళ్లతోను, యువతులు అమ్మవారి అలంకరణలోను నాట్యం చేశారు. యువతీయువకులు వేర్వేరుగా కోలాటం ప్రదర్శించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాక కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, కమిటీ అధ్యక్షులు బసవరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ, ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఉడేగోళం సహకార సంఘం అధ్యక్షుడు భీమన్న, మాజీ అధ్యక్షుడు జయణ్ణ, టెంకాయల మల్లికార్జున, ధరణేష్, మహానంది, కూల్ డ్రింక్ అప్పాజీ, గోవిందప్ప, ఉలుగప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, వీరభద్రారెడ్డి, మురడి మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంజిరెడ్డి, పారాశు శివ, తదితరులు పాల్గొన్నారు. రథోత్సవం అనంతరం మంగళవారం నుంచి 10 రోజుల పాటు పశువుల జాతర నిర్వహించనున్నారు.

స్వామి పతాకం దక్కించుకున్న రాజు

మద్దానేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత రథంపై ఏర్పాటు చేసిన పతాకాన్ని (పటం) వేలం వేయగా.. తిమ్మలాపురం రాజు రూ.35వేలకు దక్కించుకున్నారు. ఈ పతాకాన్ని ఇంట్లో పెట్టుకుని పూజలు చేస్తే అరిష్టాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. అర్బన్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి దాదులూరు పోతలయ్య పరుష



పోతలయ్యస్వామి ఆలయ గోపురాలు

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి జాతర వచ్చేసింది. పోతలయ్య, చెన్నకేశవ స్వామి రూపాల్లో శివ, నారాయణ ఆలయాలు కొలువుదీరిన ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందింది. పోతలయ్యస్వామి జాతర మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆలయ ధర్మకర్త రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో తొలిరోజు జరిగే యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుందన్నారు. రామగిరి మండలం గంతిమర్రి నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు ద్వారా పోతలయ్యస్వామి కాపులు స్వామి వారి ఆభరణాలను బుట్టలో తీసుకొచ్చి అలంకరణ చేస్తారు. రెండో రోజు బుధవారం పోతలయ్య, చెన్నకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, భక్తులు పలహారపు బండ్లతో ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మూడో రోజు గురువారం వేకువజామునే తొమ్మిది మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చే గావుల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు.

మోదీచే నేడు అభివృద్ధి పనుల ప్రారంభం



సీనియర్ డీసీఎం మనోజ్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతిలో ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. పాన్ ఇండియా లెవల్‌లో 10 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రధాని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తుండగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండు సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఒకటి విశాఖపట్నం–సికింద్రాబాద్ కాగా.. మరొకటి గుంతకల్లు డివిజన్ మీదుగా కలబురిగి (గుల్బర్గ) – బెంగళూరు మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. గుంతకల్లు డివిజన్ మీదుగా ప్రస్తుతం రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రాకపోకలు సాగిస్తుండగా, మరో వందే భారత్ రైలు ప్రయాణికులకు సేవలు అందించడానికి పట్టాలు ఎక్కుతున్నట్లు వివరించారు. ఈ రైలు డివిజన్ పరిధిలో రాయచూర్, మంత్రాలయం, గుంతకల్లు, అనంతపురం రైల్వేస్టేషన్లలో మాత్రమే హాల్ట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయా రైల్వేస్టేషన్లలో మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్ లైవ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక గుంటూరు–గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గంలో 401 కిమీలు ఉండగా అందులో పూర్తి అయిన 303 కిమీ డబ్లింగ్ మార్గంను ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్నట్లు చేస్తారన్నారు. అదేవిధంగా గుంతకల్లు డివిజన్‌లోని తిరుపతి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు వివరించారు. తిరుపతి రైల్వే జంక్షన్‌లో తొలిసారిగా ప్రధాని జన్ ఔషిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు అత్యవసర చికిత్సలు అందించడంతోపాటు మందులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. డివిజన్ వ్యాప్తంగా 23 స్టేషన్లలో ఓఎస్‌ఓపీ (వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్) స్టాళ్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం సోమశేఖర్‌నాయుడు, సీసీఐ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివపురం పెద్దమ్మ హుండీ లెక్కింపు వివాదం

- దేవదాయ శాఖ అధికారులను అడ్డుకున్న పూజారులు
- పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళా పూజారి
- చివరకు పోలీసు బందోబస్తు మధ్య హుండీ కానుకల లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు

శింగనమల: శివపురం పెద్దమ్మ దేవాలయంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు వివాదానికి దారి తీసింది. దేవదాయ శాఖ అధికారులు, పూజారుల మధ్య ఉదయం నుంచి వాదోపవాదాలు సాగాయి. చివరకు సాయంత్రం పోలీసు బందోబస్తు మధ్య లెక్కింపు చేపట్టారు. హుండీ ద్వారా రూ.3,50,100 ఆదాయం లభించింది. శివపురానికి చెందిన వారు కొన్నేళ్ల నుంచి ఆలయంలో పూజారులుగా ఉంటున్నారు. ఆలయానికి ఆదాయం ఉన్నా సరైన వసతులు కల్పించడం లేదని భక్తుల నుంచి దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో పెద్దమ్మ దేవాలయాన్ని 2022 ఏప్రిల్‌లో దేవదాయ శాఖ తన ఆధీనంలోకి తీసుకుంది. దీన్ని అంగీకరించని పూజారులు న్యాయం కోసం కోర్టుకెళ్లారు. 2023లో శివపురానికి చెందిన వారితో ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపునకు దేవదాయ శాఖ ఈఓ శోభ, సిబ్బంది గుర్రప్ప, కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చారు. హుండీ లెక్కింపును పూజార్లు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బందోబస్తుకు వచ్చారు. అయినప్పటికీ లెక్కింపు సాగకుండా పూజారులు అభ్యంతరం తెలిపారు. ఒక దశలో మహిళా పూజారి తలపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సీఐ శ్రీధర్, ఏఎస్ఐ చితంబరి పూజార్లతో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు.

ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

శివపురం పెద్దమ్మ దేవాలయం వద్ద అభివృద్ధి పనులకు రూ.90 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు ఈఓ శోభ తెలిపారు. ఇందులో దేవాలయం తరఫున రూ.15 లక్షలు చెల్లిస్తే, రూ.75 లక్షలు దేవాదాయ శాఖ మంజూరు చేస్తుందన్నారు.

ఆటో కింద పడి చిన్నారి మృతి

బత్తలపల్లి: డ్రైవర్ గమనించకుండా ఆటోను ముందుకు పోనివ్వడంతో చక్రాల కిందపడి చిన్నారి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లిలోని బృందావన కాలనీకి చెందిన బాషా, ఫాతిమా దంపతులు. వీరికి ఒక కుమారుడు, ఏడుగురు కుమార్తెలు సంతానం. సోమవారం వీరి ఇంటి వద్దకు ఫిల్టర్ నీళ్ల ఆటో వచ్చింది. అక్కడ స్థానికులకు నీళ్లు వదిలిన అనంతరం డ్రైవర్ ఆటోను ముందుకు తీసుకెళ్లేందుకు సమాయత్తమయ్యాడు. అయితే అప్పటికే చక్రాల వద్ద బాషా, ఫాతిమా దంపతుల చిన్న కుమార్తె షాహిదా (2) చేరుకుని ఉంది. దీన్ని గమనించకుండా డ్రైవర్ ఆటోను ముందుకు పోనివ్వడంతో చక్రాల కిందపడి షాహిదా మృతి చెందింది. కొంతసేపటి తర్వాత బయటకు వచ్చిన ఫాతిమాకు విగతజీవిగా పడి ఉన్న కుమార్తె కనిపించడంతో బోరున విలపించింది. ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి, కొడేకండ్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఎస్ఐ అంత్యక్రియలు



ఏఆర్ ఎస్ఐ హాజీపీరాకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: హఠాన్మరణం చెందిన అనంతపురం ఏఆర్ ఎస్ఐ హాజీపీరాకు సోమవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ముస్లిం శ్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియలకు ఏఆర్ డీఎస్పీ మునిరాజా, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే దేశాభివృద్ధి

అనంతపురం క్రైం: ప్రశాంతి జిల్లా సమాఖ్యలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా పరిపుష్టిగా ఉంటే ఆ కుటుంబం ఊరు, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలని, బాల్య, మేనరిక వివాహాలకు స్వస్తి పలకాలని సూచించారు. ఏపీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ మహిళలందరూ సంఘాల్లో చేరి స్త్రీనిధి, సీఐఎఫ్, ఎస్సీ, ఎస్టీ రుణాల ద్వారా జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

విపక్షాలన్నీ ఏకమైనా జగన్‌ను ఓడించలేవు





ఆత్మకూరు: వైఎస్సార్ చేయూత మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాప్తాడు: చేయూత సంబరాలకు హాజరైన మహిళలు

- సీఎం జగన్‌ను ఎదిరించలేక జనసేన, బీజేపీతో టీడీపీ పొత్తు
- నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: రానున్న ఎన్నికల్లో విపక్షాలన్నీ ఏకమైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఓడించలేవు. ఎన్ని జెండాలు జత కట్టినా...వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం. అక్కచెల్లెమ్మల మోములో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నాలుగో విడత వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. మండలంలోని 2,226 మంది మహిళలకు మంజూరైన రూ.4,17,37,500 చెక్కును జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి అందజేశారు. తొలుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదన్నారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట.. ఇచ్చిన మాటపై చంద్రబాబు ఏనాడూ నిలబడలేదన్నారు. మళ్లీ అధికారం కోసం టీడీపీ నాయకులు, చంద్రబాబు మాయ మాటలు చెప్పేందుకు వస్తారని తెలిపారు. వీరికి గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. పరిటాల సునీత కూడా మీరు రుణాలు కట్టదని చెప్పిందని, గెలిచిన నాలుగు సంవత్సరాల తర్వాత అసెంబ్లీలో డ్వాక్రా రుణాలు మాఫీ చేసేదే లేదని, అటువంటి హామీ ఇవ్వలేదని చెప్పడం జరిగిందన్నారు. పరిటాల కుటుంబం 25 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా ప్రజల గురించి ఏనాడు ఆలోచించ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయమని సీఎం జగన్ చెబుతున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ ఇలా చెప్పిన దమ్మున్న నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది సీఎం జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. సీఎం జగన్‌ను చంద్రబాబు ఎదిరించలేకే జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబును ఓడిస్తే టీడీపీ భూస్థాపితం అవుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకలు సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, ఎంపీపీలు చిట్రెడ్డి జయలక్ష్మి, భాగ్యమ్మ, జెడ్పీటీసీలు పసుపుల హేమావతి, చంద్రాకుమార్, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఏపీఎం నల్లప్ప, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ చేయూత, మహిళలకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో సీఎం జగనన్న చేపట్టిన నవరత్నాల్లో భాగంగా ప్రతి ఇంటికి పథకాలు అందించామన్నారు. మండలంలోని పి.యాలేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. అదే విధంగా మండలంలోని పంపనూరులో విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచులు ఎర్రిస్వామి, నరసింహులు, నాగరత్నమ్మ, తిరుపాలమ్మ, ఓబులేష్, ఆరోగ్యంరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, ముఖ్య వైఎస్సార్‌సీపీ నాయకులు బాలపోతన్న, ఫణిరెడ్డి, మధు, వాసుదేవరెడ్డి, నాగరాజు, అతిక్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి రెడ్డి, వెంకట్రాముడు, సుధాకర్‌రెడ్డి, ముత్యాలన్న, మన్సూర్‌వలి, జెడ్పీటీసీలు మారుతి ప్రసాద్, చంద్రకుమార్, నాగార్జున, గోవిందరెడ్డి, హేమావతి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సద్దికూటి శివారెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, రామాంజి, తరుణ్, నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వండి





ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఝాన్సీ లక్ష్మీబాయి స్కూల్‌లో ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం

- 39వ డివిజన్‌లో రూ.2.66 కోట్లతో అభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం జరిగింది. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరంలోని 39వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ప్రతాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.2 కోట్లకు (ఒక్కో డివిజన్)పైగా అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో రోడ్లు, కాలువలు వేయాలని అప్పటి పాలకులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కేవలం రెండున్నరేళ్ల వ్యవధిలోనే రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. 39వ డివిజన్‌లో రూ.2.66 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. బీటీ, సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో నిరంతరంగా పనులు చేపట్టామన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, తదితర పథకాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆర్థిక స్థితిగతులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెరుగుపర్చారన్నారు. గతంలో పథకం వర్తించాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల ఆశీస్సులుండాల్సిందేన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడం జరిగిందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు.

శిలాఫలకాల ఆవిష్కరణ

39వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. లక్ష్మీనగర్ మెయిన్ రోడ్డు, జన్మభూమి రోడ్డులో ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.1.41 కోట్లతో బీటీ రోడ్డు, అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్లు, కాలువను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, క్లస్టర్ అధ్యక్షుడు మధు, నాయకులు రామయ్య, వనరాస బలరాం, రఫీ, ఆర్వేటి సురేష్, హిదాయతుల్లా, నీలూరి సురేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, శరత్,హరి, నాగార్జున, పెద్దన్న, సోమనాథ్, జానీ, అమర్‌నాథ్ రెడ్డి, రాధాకృష్ణ, శోభాబాయి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

అనంతపురం కార్పొరేషన్: పేద, సామాన్య మధ్య తరగతి ప్రజల కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను ప్రభుత్వం తీర్చిదిద్దిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 35వ డివిజన్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయి స్కూల్‌లో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీని కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ ప్రకాష్‌రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబ్బులు, స్థిరాస్తులు అసలైన ఆస్తి కాదని, పిల్లలకు అందించే గొప్ప ఆస్తి చదువేనన్నారు. సీఎం జగన్ నాడు–నేడు కింద రూ.వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజన్ కలిగిన ముఖ్యమంత్రి అని కొనియాడారు. అందులో భాగంగానే ముందుచూపుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చారన్నారు.

35వ డివిజన్‌లో రూ.9 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలోని 35వ డివిజన్‌లో రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయని స్థానిక కార్పొరేట్ కొండ్రెడ్డి రాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. నాడు–నేడు కింద ఝాన్సీ లక్ష్మీబాయి పాఠశాలలో రూ.80 లక్షల వ్యయంతో అదనపు గదులు, టాయిలెట్స్, రూ.35 లక్షలతో ప్రహరీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాంనగర్‌లో రూ.80 లక్షలతో బీటీ రోడ్డు, రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.10 లక్షలతో కాలువ, రూ.40 లక్షలతో సవీరా ఆస్పత్రి వద్ద బీటీ రోడ్డు, తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇసాక్ అహ్మద్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, హెచ్‌ఎం ప్రభాకర్, నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి, నరసింహులు, విజయభాస్కర్, నాగరాజరెడ్డి, వెంకట్‌రెడ్డి, బంకు శీన, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కొడిమి, ఉప్పరపల్లి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. కొడిమిలో విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు విద్యుత్ స్టేషన్ల ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాలకు అధికలోడు సమస్య ఉండదన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారుల, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచులు సుబ్బిరెడ్డి, సావిత్రి, బండా అంజియాదవ్, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు బండి పవన్‌కుమార్, మఠం శ్యాంసుందర్, వడ్డే శీనా, డాక్టర్ శీనా పాల్గొన్నారు.

భగవంతుడు చూపిన బాటలో నడుద్దాం



వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకులను సత్కరిస్తున్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్: మనిషి ప్రశాంతంగా జీవించడానికి భగవంతుడు నిర్దేశించిన బాటలోనే నడుద్దామని ప్రఖ్యాత దైవజనులు పాస్టర్ టైటస్ బాబు అన్నారు. సోమవారం తపోవనంలోని కింగ్ ఆఫ్ కింగ్స్ చర్చిలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల ఆధ్యాత్మిక సమావేశం జరిగింది. దాసుని పరిచర్య, స్నేహితుని, కుమారుని పరిచర్య అనే మూడు అంశాలపై టైటస్‌బాబు ప్రసంగించారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామసుబ్బారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు , జాయింట్ సెక్రటరీ పాస్టర్ మనష్షే, జీఆర్ ఆనంద్, బ్రదర్ బండెల రాజు, పాస్టర్లు జీవన్‌బాబు, రూఫస్, బిషప్ వాసు, అనిల్‌కాంత్, జీవప్రకాష్, స్థానిక సంఘ కాపరి శాంసన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల సందర్శన

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి సోమవారం సందర్శించారు. ప్రస్తుతం పంట కాయలు ఊరే దశ, గింజ పట్టే దశలో ఉందని.. పైరులో కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించినట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కాండం కుళ్లు బూజు తెగులు కలుగ చేసే శిలీంద్రం భూమి ద్వారా విత్తనం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ తెగులు పంట వేసిన సుమారు 70 రోజుల నుంచి పంట చివరి రోజు వరకూ కనిపిస్తుందన్నారు. వీటి నివారణకు సజ్జ, జొన్న పంటలతో పంట మార్పిడి చేయాలన్నారు. కిలో విత్తనానికి మూడు గ్రాములు మ్యాంకోజెబ్ లేదా స్ప్రింట్ 2.5 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఎకరానికి 200 కిలోల జిప్సంను పూత సమయంలో వేసుకోవాలన్నారు. పొలంలో తెగుళ్లు సోకిన మొక్కలు చుట్టూ 2 ఎంఎల్ హెక్సాకొనాజోల్ ఒక లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు.

ముస్లింలకు 'ఈద్ కా చాంద్ ముబారక్'

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: రంజాన్ అంటే ఉపవాస దీక్ష మాత్రమే కాదని, మనిషిలోని చెడు భావాల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా ముస్లింలందరికీ ఈద్ కా చాంద్ ముబారక్ ఎమ్మెల్యే తెలిపారు.

ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో ఆచరించాలి



దువా చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రంజాన్ మాసాన్ని అందరం భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని మేయర్ వసీం సలీం అన్నారు. సోమవారం రాత్రి రంజాన్ పవిత్ర మాసం ప్రారంభం కావడానికి ముందు స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో నెలవంక దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. మేయర్ మాట్లాడుతూ.. నెల రోజుల పాటూ నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు మసీదుల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, ఇస్సాక్ మదని, కో–ఆప్షన్ సభ్యుడు సంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, రఫీ, షేక్షావలి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. నెలవంక దర్శనంతో రంజాన్ ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా ప్రారంభం కానున్నాయని వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ అన్నారు. సోమవారం రాత్రి ఖాజా నగర్‌లోని ఆల్ హబీబ్ మసీదు కమిటీ సభ్యులు, ముఖ్తదీలతో కలిసి ఆయన నెలవంక వీక్షణంలో పాల్గొన్నారు. సహరితో ప్రారంభమై ఇఫ్తార్‌తో ముగిసే నెల రోజుల ఉపవాస దీక్షలు చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

రాప్తాడులో టీడీపీకి ఎదురుదెబ్బ



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గంజి రాముడు

రాప్తాడు: మాజీ మంత్రి పరిటాల సునీత కంచుకోటగా ఉన్న నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గంజీ రాముడుతో పాటు మరో పది కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆవరణలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. గంజీ రాముడు మాట్లాడుతూ..ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైనట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరుతల నాగేంద్ర, ఎల్ఐసీ వెంకటరాముడు, సాకే చంద్ర, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత ప్రగతి సాధించాలి



వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన మహిళలను సన్మానించిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న 12 మందికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ షారోన్, జీజీహెచ్ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్ బేగం ప్రసంగించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, అన్ని విధాల అభివృద్ధి సాధించాలంటే చదువులో రాణించాలన్నారు. అనంతరం వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్, ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ ప్రసూన, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లలితకుమారి, ఏఎస్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ యశోద, హెడ్‌నర్సు పుష్పలత, స్టాఫ్ నర్సు విజయమ్మ, ఎఫ్‌ఎన్‌ఓ జ్యోతి, సెక్యూరిటీ అంజలీకుమారి, వర్కర్ వై సువర్ణమ్మ, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ సుచిత్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయకుమారి, డాక్టర్ నీలిమ, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, హెడ్‌నర్సు సైరాభాను, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు అనురాధ, పీజీ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ఏఫ్ ఏకాలజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా సస్యమిత్ర ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, కన్వీనర్లు, కో కన్వీనర్లతో ర్యాలీ చేపట్టారు. బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేసి మహిళల ఐక్యత వర్ధిల్లాలి అంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఫ్ ఏకాలజీ ఏఎల్‌పీ కో–ఆర్డినేటర్ రిజ్వానా సీఆర్‌జెడ్‌పీఎస్ఎఫ్ ఎర్రిస్వామి రెడ్డి, ఎంటీఎల్ ఇంద్రజ, రూట్‌సెట్ సంస్థ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడురూరల్: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం రూరల్ పరిధిలోని ఏ.నారాయణపురం, సోమనాథనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది, పిల్లల తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. మినుములు, రాగి, జొన్న, కొర్రలు, ఊదలు, అండుకొర్రలు తదితర సిరిధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనత అధిగమించవచ్చన్నారు. వైఎస్సార్ పోషణ కింద అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్వాడీ వర్కర్లు కౌసర్‌బాను, సీతమ్మ, మహబూబ్‌బీ పాల్గొన్నారు.

రేంజ్ ఆఫీస్ మేనేజర్‌కు సత్కారం



రేంజ్ ఆఫీసు మేనేజర్‌ను సత్కరిస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మి రెడ్డి

అనంతపురం: అనంతపురం రేంజ్ ఆఫీసులో మేనేజర్ (ఓ.ఎస్)గా పని ఏస్తున్న జె.మాధవి ఏఏఓగా పదోన్నతి పొందారు. రెండో బెటాలియన్ ఏపీఎస్‌పీ కర్నూలుకు బదిలీపై వెళ్లారు. సోమవారం అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మి రెడ్డి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

నేడు రామకృష్ణ పరమహంస జయంతి

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో మంగళవారం భగవాన్ రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహించనున్నారు. ఉదయం వేదపఠనం, పరమహంస దివ్య పారాయణం, విశేష పూజలు ఉంటాయి. సాయంత్రం నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని సమితి కార్యదర్శి గుత్తి శ్రీధరమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 49వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 49వ డివిజన్‌లోని ఇందిరానగర్ మంళవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ నగర్‌లోని ఆంజనేయస్వామి గుడి ఆర్చ్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అధ్యాపకురాలికి 'నేషనల్ ఉమెన్ లెజెండరీ' అవార్డు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యాపకురాలు వాధులపల్లి ఫిరోజకు 'నేషనల్ ఉమెన్ లెజండరీ' అవార్డు దక్కింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ భం సాయి సేవా ట్రస్ట్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు 'నేషనల్ ఉమెన్ లెజెండరీ' అవార్డులను అందజేసింది. ఈ క్రమంలో కవితా రంగంలో కృషి చేసినందుకు వాదులపల్లి ఫిరోజను 'నేషనల్ ఉమెన్ లెజెండరీ అవార్డు'కు ఎంపిక చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, కళా రత్న డాక్టర్ బిక్కికృష్ణ, నరసింహప్ప, రాజా, వాసి రెడ్డి మల్లీశ్వరి చేతుల మీదుగా రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో ఫిరోజ అవార్డు అందుకున్నారు.

హాస్టల్ భూమిని సర్వే చేయాలి

అనంతపురం అర్బన్: ఉరవకొండలో శ్రీ గాంధీ హరిజన హాస్టల్‌కు చెందిన భూమిని అధికారులు వేరొకరి పేరున మార్చారని ఎస్సీ సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నాయకులు మీనుగుగోపాల్, సాకేహరి, నల్లప్ప, ఎల్లన్న మాట్లాడుతూ.. ఉరవకొండ పొలం సర్వే నెంబరు 533–బీ1లోని 1.65 ఎకరాల భూమి 1941 నుంచి 2007 వరకు శ్రీ గాంధీ హరిజన హాస్టల్ పేరు మీద (ఆర్‌హెచ్ నెంబర్ 189 ఖాతా నెంబరు 418) అండగల్, 1బీలో ఉందన్నారు. అయితే 2008లో ఖాతా నెంబరు 12గా మార్చి అబ్దుల్ అను వంశంగా నమోదు చేశారాన్నారు. అదే విధంగా

సంక్షిప్త సమాచారం

హాస్టల్‌కు సర్వే నంబరు 533–1సిలో 1.02 ఎకరాల భూమిని రికార్డుల్లో మార్పు చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రాజు, ఎర్రిస్వామి, చంద్రశేఖర్, లాల్‌ప్రసాద్, రమేష్, ఎసన్న, రామాంజనేయులు, వన్నూరప్ప, కుళ్లాయప్ప, హనుమంతు పాల్గొన్నారు.

ససప మాధవరాజుల ఉత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ససప గ్రామంలోని మాధవరాజుల స్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం చెరుకు కోలను పూజలకు తీసుకొచ్చారు. 12వ తేదీ స్వామి ససప నుంచి బయలుదేరి ఉరుములు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుంటారు. 13వ తేదీన పన్నేరపు బండ్లు స్వామి వారి ఆలయం చుట్టూ ఊరేగింపుగా వెళ్లట, 14వ తేదీన రథోత్సవం, 15వ తేదీన స్వామి వారి అలంకరణ పరుష, 16వ తేదీన స్వామి ఆలయం నుంచి బయలుదేరి ఉరుములు, ఊరేగింపులతో గ్రామానికి చేరుట, 17వ తేదీన మారుపూజతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

స్పందనకు 12 ఫిర్యాదులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 ఫిర్యాదులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ సమస్యలను తెలుసుకుని వాటికి నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ 6, ఇంజినీరింగ్ 1, పబ్లిక్ హెల్త్ 4, అకౌంట్స్ విభాగం 1 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఈఈ సూర్యనారాయణ, సూపరింటెండెంట్లు ఖయూం, విజయ్‌కుమార్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం: నగరంలోని వైభవ్ రెసిడెన్స్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో కక్కలపల్లికి చెందిన కురుబ గొల్ల పల్లయ్య (40) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తలారి వీరాంజినేయులు (29), వడ్డే గోపాల్ (28) గాయపడ్డారు. వీరాంజనేయులు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరాలయంలో గత పది రోజులుగా సందడిగా సాగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ధ్వజారోహణతో ఆరంభమైన ఉత్సవాలు ధ్వజ అవరోహణతో ముగిసినట్లు ఆలయ ఈఓ రమేష్‌బాబు తెలిపారు. చివరి రోజు ఆలయంలో శాంతి హోమాలు, పార్వతీ పరమేశ్వరుల త్రిశూల స్నానాలు జరిగాయన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి

అనంతపురం అగ్రికల్చర్: సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్నికల బాండ్లు ప్రకటించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు జి.ఓబులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించిందన్నారు. ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టి 2017లో కోట్ల రూపాయలు అక్రమంగా తమ ఖాతాలో వేసుకుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, బాల రంగయ్య, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇర్ఫాన్, ప్రకాష్, పోతులయ్య, సురేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సౌత్ పాఠశాలలో (రోడ్లో బడి) మంగళవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వరలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.